# పాడుబుద్ధి

పక్కింటి మొగుడూపెళ్లాలు దేనికో కీచులాడుకుంటున్నట్లుగా అనిపించి – కాదు... వినిపించి, ఓ చెవిని అటుకేసి పారేసాను. రిటైరైపోయి లంకంత ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వాడినాయె – పొద్దుపోక చస్తున్న వాడినాయె – ఏదో కాలక్షేపంగా ఉంటుంది కదాని కుర్చీని మా రెండు పోర్షన్లకీ మధ్య ఉన్న తలుపు దగ్గరికి జరుపుకుని మరీ కూర్చున్నాను.

"ఛీ – మీది మరీ ఇంత పాడుబుద్ధి అనుకోలేదు" అంటోంది లావణ్య. "పాడుబుద్ధా? అసలేంటి లవ్వూ నీ ఉద్దేశ్యం?" చాలా బాధగా అన్నాడు కార్తీక్.

వాళ్లిద్దరూ మా ఇంట్లో ఓ పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న యువదంపతులు. ఏడాది నుంచి చూస్తున్నాగా – ఆ పిల్ల లావణ్య చాలా మంచిది. ఎంత అందంగా ఉంటుందో అంత వినయంగాను, శాంతంగానూ కూడా ఉంటుంది. ఇంటిని ఎంత చక్కగా తీర్చిదిద్దుకుంటుందో చెప్పలేం.

ముఖ్యంగా నా విషయంలో ఆ పిల్ల చాలా చాలా మంచిది. "బాబాయ్‌గారూ – బాబాయ్‌గారూ" అంటూ ఎంతో ఆప్యాయంగా పిలుస్తుంటుంది. వాళ్లింట్లో స్పెషల్‌గా ఏం వండుకున్నా – "కాస్త రుచి చూడండి బాబాయ్‌గారూ..." అని నాకు కంపల్సరీగా తెచ్చిస్తూంటుంది.

మా పెద్దాడు స్టేట్స్‌లో ఉంటున్నాడు డాక్టర్‌గా. మా చిన్నోడు ఢిల్లీలో ఉంటున్నాడు ఇంజనీర్‌గా. నా ఇంటిదీపం గాయత్రి పోయినప్పటి నుంచి నేను బోలెడంత ఒంటరితనాన్ని అనుభవిస్తూ ఒక్కడ్నే ఉంటున్నాను ఇక్కడ.



ఎంతో కష్టపడి - ఇష్టపడి కట్టించుకున్న ఇల్లు. అందుకే నాకు నా ఇల్లు వదిలి ఎక్కడికీ పోబుద్ధి కాదు. "ఎందుకు నాన్నా నువు ఒక్కడివే ఇక్కడ, ఒంటరిగా? మాలో ఎవరో ఒకరి దగ్గరి కొచ్చి ఉండొచ్చుగా." అని మా అబ్బాయిలిద్దరూ - ఇక్కడి కొచ్చినపుడల్లా అంటూనే ఉంటారు - వాళ్ల తప్పేంలేదు. నేనే వెళ్లను వాళ్లతో.

నిజానికి నాకు నా ఇంటిని రెండు పోర్షన్స్ గా విభజించి ఓ భాగాన్ని అద్దెకివ్వాల్సిన అవసరమేంలేదు - ఒక రిటైర్డ్ క్లాస్ వన్ ఎంప్లాయ్ గా నా కొస్తున్న పెన్షన్ ఎక్కతక్క సరిపోతుంది - అదీగాక ఏడాదికోసారి పిల్లలిద్దరూ చూడ్డాని కొచ్చినప్పుడల్లా వద్దన్నా సరే - ఎంతో కొంత నా చేతిలో పెట్టి వెళ్తుంటారు.

ఆ యువదంపతులకి నేనా పోర్షన్ అద్దెకిచ్చింది కేవలం నాకు తోడుగా ఉంటారని మాత్రమే. ఈ సోదంతా చెప్పకపోయినా మీకు అర్థమౌతుంది నా పరిస్థితి. వయసు దాటిపోతున్నది కదా - ప్రతీదీ దీర్ఘంగా చెప్పటం అలవాటైంది. ఏమనుకోకండి - ఉండటమే కాదు - ఈ ఒక్క ఏడాదిలోనే ఎంతో ఆత్మీయులుగా కూడా అయిపోయారు.

"పాడుబుద్ధి కాకపోతే - ఏంటది? లావణ్య కోపంగా అంటోంది. "అది పాడుబుద్ధి ఎలా అవుద్ది?" దీనంగా అంటున్నాడు కార్తీక్. అసలేం జరిగుంటుందబ్బా? నాలో కుతూహలం రెట్టింపైంది. ఏదో వెధవ పని చేసే వుంటాడు కార్తీక్ - లేకపోతే ఆ పిల్ల ఎందుకలా ఇరిటేట్ అవుతుంది?

పాడుబుద్ధి కాకపోతే మంచిబుద్ధా? అసలే నా అందం అంతంత మాత్రం..." లావణ్య మాటల్తోపాటు ఏదో గిన్నెను నేలకేసి విసిరి కొట్టిన శబ్దం.

"లవ్వూ - ప్లీజ్... లవ్వూ..." కార్తీక్ వేడుకోలు... "లవ్వూ లేదు గివ్వూలేదు... దూరంగా ఉండండి..." లావణ్య తిరస్కారం. నోడవుట్ - ఆ అమ్మాయి అంత సీరియస్ అవుతోందీ అంటే నిస్సందేహంగా కార్తీక్ ఏదో దగుల్బాజీ పని చేసే ఉంటాడు.

"పాడుబుద్ధి... అసలే నాది అంతంత మాత్రం అందం... లావణ్య అన్న ఆ మాటల్ని బట్టి ఆ అమ్మాయి కన్నా కాస్త అందంగా ఉన్న ఇంకో అమ్మాయిని చూసి మనసు పడి - మన వాడేదో కాని పని చేసే ఉంటాడనిపించింది నాకు. అనుభవంతో తలపండినవాడిని - మగబుద్ధి ఎలాంటిదో నాకు తెలియదా? పైకి ఎంత మంచిగా ఉన్నా మగవాడన్న ప్రతివాడిలోనూ - ఆ పాడుబుద్ధి ఎంతో కొంత ఉండనే ఉంటుంది.

అవకాశాలు రాకనో - లేక పిరికితనం కొద్దీనో కొంతమంది నిత్యబుద్ధిమంతుల్లా ఉండిపోతారే తప్ప మగవాడిలో - ఆ పాడుబుద్ధి - అదే చిత్తచాంచల్యం అనేది అసలే లేకుండా ఉండదు. ఈ విషయంలో నేను కూడా ఏం తక్కువ తిన్న వాడ్నికాదు - ప్రవరాఖ్యుడ్నీ కాదు.

నా భార్య గాయత్రి నిజానికి చాలా అందగత్తె. అయినా కూడా ఒకసారి నేను మా అప్పటి పనిమనిషి పార్వతితో సరసమాడబోయి - మా ఆవిడకి రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాను.

ఆ రోజు గాయత్రి కూడా ఇలాగే నానా రాద్ధాంతమూ చేసింది. "ఛీ - మీది ఇంత పాడుబుద్ధి అనుకోలేదు - ఛా..." అంటూ ఓ నెల రోజుల దాకా నన్ను సతాయించి అల్లల్లాడించింది.

**మల్లి కోలపల్లి**

ఆ పార్వతినైతే అప్పటికప్పుడే పన్లోంచి తీసేసింది - ఏదో కక్కుర్తే తప్ప - నిజానికా పార్వతేం బాగుండదు - అయినా అందుబాటులో ఉందని - నా మనసు చలించిందీ అంటే అది మగాడిలో సహజంగానే ఉండే పాడుబుద్ధి కాక మరేంటి?

కార్తీక్ కూడా పదహారణాల మగాడే కాబట్టి చేసే ఉంటాడు ఏదో వెధవపని! ఏం చేసుంటాడబ్బా? ఎవరితో చేసుంటాడబ్బా? నా దృష్టి వెంటనే పనిమనిషి రంగమ్మ మీద కెళ్లింది - ఛఛ... ఏం బాగుంటుందసలు - అదీగాక వయసులో కార్తీక్ కన్నా చాలా పెద్దది.

పాలుపోసే అనసూయ... యాక్ - థూ... పగలు చూస్తే రాత్రి కల్లో కొచ్చేంత వికారంగా ఉంటుంది. ఎత్తుపళ్లు - అంతే కాకుండా ఆమె కూడా కార్తీక్ కన్నా పెద్దది. మరింకెవరితో అయ్యుంటుందబ్బా? అతని ఆఫీసులో ఎవరన్నా అందగత్తెలున్నారా? ఏమో?

నీలవేణి అనే అమ్మాయి రోజూ పొద్దున్నే ఇందుకూరుపేట నుంచి వచ్చి ఆకుకూరలిచ్చి పోతుంటుంది. నీలవేణి కాస్త నదురుగానే ఉంటుంది. ఫర్వాలేదు... నదురుగా ఏం ఖర్మ చాలా బాగుంటుంది - తీర్చిదిద్దినట్లుగా ఉంటుంది.

> ## పాత బంగారం
>
> అనివార్య కారణాల వల్ల ఈ నెల పాత బంగారం శీర్షికలో కథ ప్రచురించలేకపోయాం. ఈ శీర్షిక వచ్చే నెల నుంచి యధావిధిగా కొనసాగుతుందని గమనించగలరు.
>
> - ఎడిటర్

చెప్పలేం గానీ - ఆ అమ్మాయి ఆకుకూరల గంప నెత్తిన పెట్టుకుని వయ్యారంగా నడుస్తుంటే - బారుగా ఉన్న చేతులు రెండూ పైకెత్తి గంపని సర్దుకుంటుంటే... ఆ కులుకూ, ఆ హొయలూ వయసుడిగిపోయిన నాకే మతిపోయేలా చేస్తుంటాయి.

మరలాంటిది వయసులో ఉన్న కార్తీక్ టెంప్ట్ అయితే - ఆశ్చర్యం ఏముందందులో -

సో... సందేహం లేదు - ఆ మూడోవ్యక్తి నీలవేణే - అందునా పల్లెటూరిపిల్ల. ఊ - అంటే పళ్లికిలిస్తుంటుంది. ఆ - అంటే కావాలనే పైట సర్దుకుంటూంటుంది.

ఖచ్చితంగా నీలవేణే - ఏంచేసుంటాడు మనవాడు? - చెయ్యిగానీ పట్టుకున్నాడా? ఆ దృశ్యం లావణ్య కంటబడి ఉంటుందా?! నా ఆలోచనలు రేసుగుర్రాల్లా పరుగుతీస్తుంటే - పక్క పోర్షన్‌లోంచి లావణ్య కంఠం మళ్లీ వినిపించింది.

"హు మళ్లీ మొదలెట్టారా - ఛీ మీకిదేం పాడుబుద్ధండీ - అసలే నాది అంతంత మాత్రం అందం - అలాంటిది పద్దాక మీరిలా నువ్ రంభలా ఉన్నావ్ తిలోత్తమలా ఉన్నావ్ - అని పొగుడుతూ కూర్చుంటే - మీదిష్టి తగిలి ఉన్న అందం కాస్తా పోదూ..."

ఆ కంఠంలో కరుకుదనం లేదు - గర్వమూ, చిలిపితనమూ, అల్లరి, ఆనందమూ కలగలిసి ఉన్నాయ్.

వార్నీ... అనుకున్నాను నేను. న్యాయంగా 'ఒరేయ్ ముసిలాడా! ఎంత పాడుబుద్ధిరా నీది' - అని అనుకోవాలి.

కానీ, తమని తామే ఎవరూ తిట్టుకోలేరు కదా! - అందుచేత మీరు తిట్టండి!! ●